kalamdaily.com

# కలం

ప్రజల గళం...

Follow on: Kalamtelugu

శుక్రవారం ● 17-04-2026

పేజీలు: 3

360° SINGLE TOPIC

ఉమెన్ కోటా

రువాండా.. ఆఫ్రికాలోని ఓ చిన్నదేశం. జనాభా కేవలం కోటిన్నర. కానీ అక్కడి పార్లమెంట్ ఉభయ సభల్లో మహిళా ప్రతినిధులు 60 శాతంపైనే. ప్రపంచంలోనే మహిళలకు అగ్రతాంబూలం వేస్తున్న కంట్రీల్లో దానిదే మొదటి స్థానం! కోటీ 10 లక్షల జనాభా ఉన్న క్యూబాలోనూ 55 శాతం మంది ప్రజాప్రతినిధులు మహిళలే! మతపరమైన నిబంధనలతో మహిళలపై వివక్ష ప్రదర్శించే యూఏఈ చట్టసభల్లోనూ ఉమెన్ కోటా 50 శాతంపైనే!! స్వాతంత్ర్యం వచ్చి 79 ఏండ్లు దగ్గరికి వస్తున్నా, రాజ్యాంగం అమలులోకి వచ్చి 76 ఏండ్లు దాటుతున్నా 140 కోట్ల జనాభా కలిగిన భారత్‌లో మాత్రం మహిళా ప్రాతినిధ్యం అంతంతే. ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్య దేశమని గొప్పగా చెప్పకుంటున్నప్పటికీ.. 543 సీట్లున్న లోక్‌సభలో ప్రస్తుతం మహిళా ప్రజాప్రతినిధులు 74 మందే. మొత్తం సభ్యుల్లో ఇది కేవలం 13.65 శాతమే! ఇక తెలంగాణ అసెంబ్లీని పరిశీలిస్తే మొత్తం 119 మంది సభ్యుల్లో మహిళా ఎమ్మెల్యేలు 8 మందే!!

చట్టసభల్లో 33 శాతం ఉమెన్ కోటా కోసం దేశంలో దశాబ్దాలుగా పోరాటం సాగుతూనే ఉంది. నాటి యూపీఏ, ఎన్డీఏ హయాంలో చర్చలు జరిగినా కొలిక్కి రాలేదు. కానీ, 2023లో ‘నారీ శక్తి వందన్ అధినియమ్’ పేరుతో కేంద్ర ప్రభుత్వం బిల్లును తెచ్చి చట్టబద్ధత కల్పించింది. దాని ప్రకారం 2026 తర్వాత పూర్తయ్యే జనగణన అనంతరం జరిగే లోక్‌సభ, శాసనసభల ఎన్నికల్లో 33% మహిళా రిజర్వేషన్లు అమల్లోకి రావాల్సి ఉన్నది. అప్పటివరకూ వెయిట్ చేయడమెందుకనే చర్చలు జరుగుతున్న తరుణంలో 2029లోనే అమల్లోకి తెచ్చేలా తాజా పార్లమెంట్ సమావేశాల్లో ప్రత్యేక సవరణకు కేంద్రం ఓకే చెప్పింది. డీలిమిటేషన్ చేపట్టి లోక్‌సభ స్థానాలను 850కు పెంచి మహిళా రిజర్వేషన్ అమలు చేయాలనుకుంటున్నది. దీంతో 272 మంది మహిళా ఎంపీలు లోక్‌సభలో కొలువుదీరనున్నారు.

మహిళలకు రాజకీయ స్వాతంత్ర్యం ఉండాలంటూ బహిరంగ వేదికల మీద గంభీర ఉపన్యాసాలు చేసే నేతలు చివరకు కేబినెట్‌లో స్థానమే కల్పించని ఘట్టాన్ని స్వరాష్ట్రంలో తెలంగాణ అనుభవించింది. మహిళలు నాయకత్వ స్థానాల్లోకి రావడాన్ని జీర్ణించుకోలేక వారికి ప్రత్యక్షంగా, పరోక్షంగా అడ్డంకులు సృష్టిస్తున్న ఘటనలూ కళ్లముందే ఉన్నాయి.
ఈ 33 శాతం కోటాతోనైనా పాలనలో ‘మహిళా సాధికారత’ సాధ్యమవుతుందా? ‘ఆకాశంలో సగం’ అనే నినాదం ఫలిస్తుందా?! వివక్ష నుంచి విముక్తి దిశగా మహిళల బలమైన అడుగులు పడతాయా? ‘గాజులు తొడుక్కున్నామా.. ఉట్టికి ఎగరలేనమ్మ.. చీరకట్టుకొని ఇంట్లో కూర్చో’ అనే కామెంట్లతో పురుషాధిక్యత ప్రదర్శించే నాయకుల నోళ్లు మూతపడతాయా?

వీటన్నింటిపై కలం 360 డిగ్రీస్ ప్రత్యేక కథనం.

- సెంట్రల్ డెస్క్, కలం



## కేరళం నుంచి ఒక్కరూ లేరు!

ప్రస్తుత 18వ లోక్‌సభలో మొత్తం 543 మంది ఎంపీలు ఉంటే, వారిలో 74 మంది మాత్రమే మహిళలు. దేశవ్యాప్తంగా 22 రాష్ట్రాలు, యూటీల నుంచి మహిళలు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. మిగతా రాష్ట్రాలు, యూటీల నుంచి ప్రాతినిధ్యమే లేదు.

- పెద్ద రాష్ట్రాల్లో మహిళా ఎంపీలు లేని ఏకైక రాష్ట్రం కేరళం మాత్రమే.
- పశ్చిమ బెంగాల్ నుంచి అత్యధికంగా 11 మంది మహిళలు ఎంపీలు అయ్యారు. తర్వాత ఉత్తరప్రదేశ్, మహారాష్ట్రలో ఏడుగురు చొప్పున, మధ్యప్రదేశ్‌లో ఆరుగురు మహిళలు ఎంపీలయ్యారు.
- ప్రస్తుత లోక్‌సభలో బీజేపీకి అత్యధికంగా 31 మంది మహిళా ఎంపీలు ఉన్నారు. తర్వాత కాంగ్రెస్ నుంచి 13 మంది, తృణమూల్ కాంగ్రెస్ నుంచి 11 మంది ఉన్నారు.

# అణచివేత నుంచి అధికారం వైపు!

## చట్టసభల్లో ఉమెన్ కోటాతో సరికొత్త మార్పులు

- మహిళా ప్రజాప్రతినిధుల్లో ఇండియా స్థానమెక్కడ?
- 76 ఏండ్ల గణతంత్ర దేశంలో లోక్‌సభలో 13.65 శాతమే!
- రువాండా లాంటి చిన్న దేశాల్లో 60% ఎంపీలు మహిళలే
- మహిళా రిజర్వేషన్‌తో మగవారి మైండ్‌సెట్ మారుతుందా?
- చట్టసభల్లో అవహేళన కామెంట్లకు ఫుల్‌స్టాప్ పడుతుందా?



## 7 దశాబ్దాలు దాటినా 15 శాతం లోపే..

స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు లోక్‌సభలో మహిళల ప్రాతినిధ్యం 15 శాతం కూడా దాటలేదు. భారతదేశంలో 1951లో మొట్టమొదటి జనరల్ ఎలక్షన్స్ జరగ్గా, దానికి సంబంధించి జెండర్ వైజ్ డేటా అందుబాటులో లేదు. 1957లో జరిగిన రెండో జనరల్ ఎలక్షన్స్‌లో 45 మంది మహిళా అభ్యర్థులు పోటీ చేయగా, 22 మంది గెలిచారు. ఆనాడు లోక్‌సభలో మొత్తం సీట్లు 494 ఉండగా, మహిళా ఎంపీల శాతం 4.45 శాతమే. నాటి నుంచి నేటి వరకు లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసిన మహిళా అభ్యర్థులు, గెలిచిన మహిళల సంఖ్య పెరిగినప్పటికీ.. మొత్తం సీట్ల పరంగా చూస్తే మాత్రం వాళ్ల ప్రాతినిధ్యం ఇప్పటికీ చాలా తక్కువగా ఉన్నది.

- 1957లో 45 మంది మహిళలు పోటీ చేయగా, 2024 నాటికి ఆ సంఖ్య 800కు పెరిగింది. అంటే మహిళా అభ్యర్థులు దాదాపు 17 రెట్లు పెరిగారు.
- 1957లో మహిళా ఎంపీల ప్రాతినిధ్యం 4.50 శాతం ఉండగా, అది 2024 నాటికి 13.65 శాతానికి పెరిగింది. నిజానికి 2019లో 14.4 శాతం ఉండగా, 2024 నాటికి అది కొంచెం తగ్గింది.
- 1957లో పురుష అభ్యర్థుల సంఖ్య 1,474 ఉండగా, 2024 నాటికి 7,560కి పెరిగింది. కానీ మహిళా అభ్యర్థుల సంఖ్య మాత్రం ఏనాడూ వెయ్యి దాటలేదు.



### లోక్‌సభలో మహిళల ప్రాతినిధ్యం ఇలా..

| జనరల్ ఎలక్షన్ | మొత్తం సీట్లు | మహిళా అభ్యర్థులు | గెలిచిన వాళ్లు | పర్సంటేజీ |
|---|---|---|---|---|
| 1957 | 494 | 45 | 22 | 4.45 |
| 1962 | 494 | 66 | 31 | 6.27 |
| 1967 | 520 | 67 | 29 | 5.57 |
| 1971 | 518 | 86 | 21 | 4.05 |
| 1977 | 542 | 70 | 19 | 3.50 |
| 1980 | 542 | 143 | 28 | 5.16 |
| 1984 | 542 | 162 | 42 | 7.74 |
| 1989 | 543 | 198 | 29 | 5.34 |
| 1991 | 543 | 326 | 37 | 6.81 |
| 1996 | 543 | 599 | 40 | 7.36 |
| 1998 | 543 | 274 | 43 | 7.91 |
| 1999 | 543 | 284 | 49 | 9.02 |
| 2004 | 543 | 355 | 45 | 8.28 |
| 2009 | 543 | 556 | 59 | 10.86 |
| 2014 | 543 | 668 | 62 | 11.42 |
| 2019 | 543 | 726 | 78 | 14.36 |
| 2024 | 543 | 800 | 74 | 13.65 |

### ఇదీ పార్టీల్లో మహిళల పరిస్థితి..

- దేశవ్యాప్తంగా గత లోక్‌సభ, అసెంబ్లీ స్థానాల్లో బీజేపీ 3,638 మందికి టికెట్లు ఇస్తే.. అందులో మహిళలకు దక్కింది 410 (11 శాతం) మాత్రమే. వాళ్లలో గెలిచింది 194 మంది. కాంగ్రెస్ 3,290 మందికి టికెట్లు ఇస్తే, అందులో మహిళలు 456 (14%)మంది. గెలిచింది 72 మంది మాత్రమే.
- 2024 లోక్‌సభ, 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ తరఫున 136 మంది పోటీ చేస్తే, వారిలో మహిళలు 9 (7శాతం) మంది మాత్రమే.. గెలిచింది నలుగురే!!
- మజ్లిస్ పార్టీ ఇప్పటి వరకు ఒక్క మహిళకు కూడా లోక్‌సభ టికెట్ ఇవ్వలేదు.
- 2024 లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ తరఫున 161 మంది పోటీ చేస్తే, వారిలో మహిళలు 23 (14%) మంది మాత్రమే.. గెలిచింది 21 మంది.
- 2024 లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ తరఫున 200 మంది బరిలో ఉంటే.. వారిలో మహిళలు 24 (12%) మంది మాత్రమే.. గెలిచింది ఇద్దరే!

### బరిలో నిలిచేది అంతంతే..

- 2024 లోక్‌సభ ఎన్నికల్లో 543 స్థానాలకు పోటీ చేసిన మొత్తం అభ్యర్థుల సంఖ్య 8,360 మంది. అందులో మహిళలు కేవలం 800 మంది. అంటే 9.6 శాతమే! ఇందులో 152 నియోజకవర్గాల్లో అసలు మహిళలు పోటీనే చేయలేదు. మహారాష్ట్రలోని బారామతి, తెలంగాణలోని సికింద్రాబాద్, వరంగల్ స్థానాల్లోనే 8 మంది చొప్పున మహిళలు పోటీ చేశారు.. ఇదే అత్యధికం.
- ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఉన్న అసెంబ్లీల్లో 43,348 మంది పోటీ చేస్తే.. వారిలో మహిళలు కేవలం 4,295 (10శాతం) మంది. మొత్తం 4,123 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉంటే.. అందులో 1,698 (41%) స్థానాల్లో మహిళలు పోటీలో కూడా లేరు.
- 2024 లోక్‌సభ ఎన్నికల్లో మహిళలకు 16 శాతం టికెట్లను బీజేపీ, 13 శాతం టికెట్లను కాంగ్రెస్, 13 శాతం టికెట్లను సీపీఎం, 8 శాతం టికెట్లను బీఎస్పీ ఇచ్చింది. ఆమ్ ఆద్మీ పార్టీ అయితే 22 స్థానాల్లో పోటీ చేయగా.. ఒక్క మహిళా అభ్యర్థిని కూడా బరిలోకి దింపలేదు.
- దేశంలో ప్రాంతీయ పార్టీలు సగటున 9.99 శాతం టికెట్లను మహిళలకు ఇస్తుంటే.. తెలంగాణలోని బీఆర్ ఎస్ పార్టీ మాత్రం ఆ సగటుకన్నా తక్కువ (7%) ఇస్తున్నది. జాతీయ పార్టీలు సైతం మహిళలకు 11 శాతం టికెట్లను మాత్రమే మహిళలకు ఇస్తున్నాయి.

### గెలుపులో మాత్రం పైచేయి!

పోటీ చేస్తున్న పురుషులతో పోలిస్తే మహిళలే ఎక్కువ శాతం గెలుస్తున్నారు. పార్టీలు టికెట్లు ఇవ్వడం, పోటీ చేయడం తక్కువైనప్పటికీ విజయంలో మాత్రం వారిదే పైచేయి. 2024 లోక్‌సభ ఎన్నికల్లో పురుషులు 7,554 మంది పోటీ చేస్తే.. గెలిచింది 469 మంది. అంటే 6 శాతం. అదే 800 మంది మహిళలు పోటీ చేస్తే గెలిచింది 74 మంది. అంటే 9శాతం.

### అసెంబ్లీ సీట్లలోనూ ఆదరణ కరువు

మహిళలకు అసెంబ్లీ సీట్లలోనూ ఆదరణ కరువైంది. ఉమ్మడి ఏపీ మొదలు ఇప్పటి వరకు మహిళా అభ్యర్థులకు పార్టీలు పెద్దగా టికెట్లు ఇవ్వలేదు. రాష్ట్ర విభజన జరిగిన తర్వాత ఇటు తెలంగాణ, అటు ఏపీలోనూ అదే సిచ్యువేషన్ ఉన్నది. ఉమ్మడి ఏపీలో 1999, 2004, 2009 అసెంబ్లీ ఎన్నికలను పరిశీలిస్తే మహిళా ఎమ్మెల్యేల శాతం 10లోపే. తెలంగాణలో ఇప్పటి వరకు మూడుసార్లు అసెంబ్లీ ఎన్నికలు జరగ్గా, మహిళల ప్రాతినిధ్యం 7శాతం లోపే. ఏపీలో 2014, 2019, 2024 అసెంబ్లీ ఎన్నికలను పరిశీలిస్తే మహిళల ప్రాతినిధ్యం 11 శాతం లోపే.

#### తెలంగాణలో..


| అసెంబ్లీ ఎలక్షన్ | మొత్తం సీట్లు | మహిళా అభ్యర్థులు | గెలిచిన వాళ్లు | శాతం |
|---|---|---|---|---|
| 2014 | 119 | 127 | 9 | 7.56 |
| 2018 | 119 | 140 | 6 | 5.04 |
| 2023 | 119 | 222 | 10 | 8.40 |

#### ఆంధ్రప్రదేశ్‌లో..

| అసెంబ్లీ ఎలక్షన్ | మొత్తం సీట్లు | మహిళా అభ్యర్థులు | గెలిచిన వాళ్లు | శాతం |
|---|---|---|---|---|
| 2014 | 175 | 317 | 27 | 15.42 |
| 2019 | 175 | 193 | 14 | 8.0 |
| 2024 | 175 | 232 | 22 | 12.57 |

#### ఉమ్మడి ఏపీలో..

| అసెంబ్లీ ఎలక్షన్ | మొత్తం సీట్లు | మహిళా అభ్యర్థులు | గెలిచిన వాళ్లు | శాతం |
|---|---|---|---|---|
| 1962 | 300 | 24 | 10 | 3.33 |
| 1967 | 287 | 21 | 11 | 3.83 |
| 1972 | 287 | 49 | 0 | 0 |
| 1978 | 294 | 54 | 10 | 3.40 |
| 1983 | 294 | 66 | 11 | 3.74 |
| 1985 | 294 | 66 | 10 | 3.40 |
| 1989 | 294 | 70 | 17 | 5.78 |
| 1994 | 294 | 127 | 8 | 2.72 |
| 1999 | 294 | 157 | 28 | 9.52 |
| 2004 | 294 | 161 | 26 | 8.84 |
| 2009 | 294 | 300 | 34 | 11.56 |





రువాండా పార్లమెంట్

## గ్లోబల్‌గా 30%లోపే!

గత కొన్నేండ్లుగా ప్రపంచ వ్యాప్తంగా ఆయా దేశాల్లోని పార్లమెంట్లలో మహిళల ప్రాతినిధ్యం నామమాత్రమే. 2025 జనవరి 1న మొత్తం ఎంపీల్లో మహిళల శాతం 27.20 మాత్రమే. 2026 జనవరి 1 నాటికి ఈ వాటా 0.3% మాత్రమే పెరిగి 27.50 శాతానికి చేరింది. దిగువ సభల్లో 27.40 శాతం ఉంటే.. ఎగువ సభల్లో 27.80 శాతంగా నమోదైంది. 2025లో 49 దేశాల్లోని 62 పార్లమెంటరీ సభలకు ఎన్నికలు జరిగాయి. చట్టసభలకు ఎన్నికైన మొత్తం ఎంపీల్లో మహిళలు 29.50 శాతం మాత్రమే. ఈ సభలకు గతంలో జరిగిన ఎలక్షన్ల సమయంలో ఎన్నికైన మహిళల వాటాతో పోలిస్తే 0.60 శాతం మాత్రమే పెరుగుదల నమోదైంది.

## రువాండా.. ఫస్ట్ ప్లేస్

మహిళా ప్రజాప్రతినిధులు ఎక్కువగా ఉన్న దేశాల్లో రువాండా ఫస్ట్ ప్లేస్ ఉంది. 2026 జనవరి 1 నాటికి అక్కడ అత్యధికంగా 63.8శాతం మంది మహిళలు పార్లమెంట్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. టాప్ 10 దేశాలను చూసుకుంటే.. 57.20 శాతంతో క్యూబా రెండో స్థానంలో నిలిచింది. నికరాగ్వాలో 55 శాతం, బొలివియాలో 50.80 శాతం, మెక్సికోలో 50.40 శాతం, ఆండోర్రాలో 50 శాతం మహిళలు పార్లమెంట్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఆ తర్వాత స్థానాల్లో 50 శాతంతో యూఏఈ, 49.10 శాతంతో కోస్టారికా, 46 శాతంతో ఆస్ట్రేలియా, 46 శాతంతో ఐస్‌లాండ్ టాప్ 10 స్థానాల్లో నిలిచాయి.

## ఇండియా.. 151వ స్థానం

రువాండా వంటి అనేక దేశాలతో పోలిస్తే మహిళా ప్రజాప్రతినిధులు ఇండియాలో చాలా తక్కువ. మొత్తం 542 స్థానాల్లో 74 మంది (13.80 శాతం) మాత్రమే పార్లమెంట్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. మహిళా ప్రజాప్రతినిధుల విషయంలో ప్రపంచంలో ఇండియా స్థానం 151. మన పక్కనే ఉన్న నేపాల్ 50వ, వియత్నాం 60వ, చైనా 70వ స్థానాల్లో ఉన్నాయి. 33 శాతం కోటా అమలులోకి వస్తే భారత్ ర్యాంకింగ్ 35కు చేరుతుంది.

## కోటా వస్తే మహిళలకు 272 సీట్లు

ప్రస్తుతం లోక్‌సభలో 543 స్థానాలు ఉండగా.. కొత్త బిల్లు ప్రకారం వీటిని గరిష్టంగా 850కి పెంచాలని కేంద్రం ప్రతిపాదించింది. వీటిలో రాష్ట్రాలకు 815 సీట్లు, కేంద్ర పాలిత ప్రాంతాలకు 35 సీట్లు కేటాయించేలా ప్రతిపాదన. నారీ శక్తి వందన్ అధినియం (మహిళా రిజర్వేషన్ చట్టం) అమల్లోకి వస్తే.. మహిళలకు 272 సీట్లు దక్కుతాయని కేంద్రం ప్రకటించింది. ఏ పార్టీ దయాదాక్షిణ్యాల మీద ఆధారపడాల్సిన అవసరం లేకుండా కచ్చితంగా అంత మంది మహిళలు లోక్‌సభలో ప్రాతినిధ్యం వహిస్తారు. 2029 నుంచి కోటా అమలులోకి రానుంది.

## 2029 నుంచే అమలు..

మహిళలకు 33 శాతం రిజర్వేషన్ల అంశానికి దాదాపు నాలుగున్నర దశాబ్దాల చరిత్ర ఉంది. తొలిసారి 73, 74వ రాజ్యాంగ సవరణల ద్వారా స్థానిక సంస్థల ఎన్నికల్లో మహిళలకు రిజర్వేషన్లు కల్పించారు. అప్పుడే లోక్ సభ, శాసనసభల్లోనూ మహిళలకు రిజర్వేషన్లు కల్పించాలన్న ఆలోచనకు బీజం పడింది. 1996లో హెచ్‌డీ దేవేగౌడ సారథ్యంలోని యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వం తొలిసారి ఈ బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టింది. కానీ ఆమోదం పొందలేదు. తర్వాత వాజ్‌పేయి, మన్మోహన్ సింగ్ ప్రభుత్వాల హయాంలోనూ అదే పరిస్థితి. చివరకు 2010లో రాజ్యసభ ఆమోదం పొందినా లోక్‌సభలో మాత్రం పెండింగ్‌లోనే ఉండిపోయింది. 2014లో లోక్‌సభ రద్దవడంతో మరోసారి బిల్లు మరుగునపడిపోయింది. దాదాపు తొమ్మిదేండ్ల తర్వాత మళ్లీ బిల్లును తెరపైకి తెచ్చి.. 2023లో 106వ రాజ్యాంగ సవరణ చట్టం (నారీ శక్తి వందన్ అధినియమ్) తెచ్చారు.

- నారీ శక్తి వందన్ అధినియమ్ బిల్లుకు 2023 సెప్టెంబరు 20న లోక్‌సభ, 21న రాజ్యసభ ఆమోదం. 28న రాష్ట్రపతి ఆమోదముద్ర.
- చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ల అమలు. ఇప్పటికే రిజర్వ్ అయిన ఎస్సీ, ఎస్టీ సీట్లలో కూడా మహిళలకు 33 శాతాన్ని కేటాయిస్తారు.
- ఆరంభంలో 15 ఏండ్ల పాటు రిజర్వేషన్లు అమల్లో ఉంటాయి. ఆ తర్వాత అవసరమైతే పార్లమెంట్ వీటిని పొడిగించొచ్చు.
- 2029 లోక్‌సభ ఎన్నికల నుంచే అమలుకు వీలుగా చట్టసవరణ చేస్తున్నారు. మహిళా రిజర్వేషన్ల చట్టం రాజ్యసభకు, రాష్ట్రాల శాసన మండళ్లకు వర్తించదు.

## 2011 జనాభా లెక్కలతోనే

కేంద్ర ప్రభుత్వం 2023 సెప్టెంబర్‌లో ఆమోదించిన మహిళా రిజర్వేషన్ల బిల్లు ప్రకారం.. 33% మహిళా రిజర్వేషన్లు 2034 నుంచి అమల్లోకి రావాల్సి ఉంది. ఎందుకంటే ఆ బిల్లులో పేర్కొన్న ఆర్టికల్ 334(ఎ) ప్రకారం.. మహిళా రిజర్వేషన్ చట్టం అమల్లోకి వచ్చిన తర్వాత చేపట్టే తొలి జనాభా లెక్కల ఆధారంగా చేసే నియోజకవర్గాల పునర్విభజన అనంతరమే ఈ రిజర్వేషన్లను అమల్లోకి తేవాలి. ఆ నిబంధన ప్రకారం జనాభా లెక్కల సేకరణ కార్యక్రమం 2027 మార్చి నెలకు పూర్తవుతుంది. ఆ తర్వాత దాని లెక్కలు ప్రచురించాల్సి ఉంటుంది. అనంతరం పునర్విభజన కమిషన్ ఏర్పాటు చేయాలి. దానికి అనుగుణంగా నియోజకవర్గాల పునర్విభజన జరగాలి. ఈ పనులన్నీ 2029 ఎన్నికలలోపు పూర్తికావు. ప్రస్తుతం ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న సవరణ ప్రకారం.. కొత్త జనగణన జరిగే వరకు వేచి చూడక్కర్లేదు. నాటి ఆర్టికల్స్‌ను సవరించి.. 2011 జనాభా లెక్కల ఆధారంగానే కసరత్తును పూర్తి చేయడానికి ప్రభుత్వం ఇప్పుడు సన్నద్ధమయ్యింది. దీనికి అనుగుణంగా 2029 ఎన్నికల నుంచే మహిళా రిజర్వేషన్లు అమలవుతాయి.

## మహిళలే కొత్త మార్గం చూపిస్తారు

మహిళా బిల్లు.. దేశ చరిత్రలోనే అద్భుతం. 30 ఏండ్ల కిందే ఆమోదించాల్సిన బిల్లు ఇప్పుడు సభ ముందుకు వచ్చింది. మహిళలకు అధికారం ఉంటేనే వికసిత్ భారత్ లక్ష్యాన్ని చేరుకోవచ్చు. దేశాన్ని సరికొత్త దిశలోకి మార్చే చర్యలు చేపడుతున్నాం. మహిళలకు అధికారం ఇస్తే వారు కొత్త మార్గాన్ని చూపిస్తారు. మహిళా రిజర్వేషన్ బిల్లు ద్వారా చరిత్ర సృష్టించబోతున్నాం. దేశాభివృద్ధిలో మహిళల పాత్ర చాలా కీలకం. ఈ బిల్లును వ్యతిరేకించే వారిని మహిళా లోకం క్షమించదు. మహిళా రిజర్వేషన్ బిల్లుతో దేశానికి సరికొత్త దశా, దిశ ఇస్తున్నాం. వికసిత్ భారత్ అంటే రోడ్లు, రైళ్లు, మౌలిక సదుపాయాలు మాత్రమే కాదు. మహిళల స్వావలంబన కూడా ఉంటేనే అది సంపూర్ణ వికసిత్ భారత్ అవుతుంది. మహిళల సాధికారతను ఏ ఒక్క పార్టీ ప్రయోజనం కోసమో చూడొద్దు. ఇది దేశ ప్రజాస్వామ్య విజయంగానే భావించాలి. గత 25-30 ఏండ్లలో మహిళలకు రిజర్వేషన్ హక్కు కల్పించకుండా ఎవరైతే అడ్డుకున్నారో.. వారిని మహిళలు ఎన్నటికీ క్షమించలేదు. మహిళా శక్తికి అన్యాయం జరిగితే సహించేది లేదు. 2029 ఎన్నికల నాటికి మహిళా రిజర్వేషన్లు అమల్లో ఉండాలన్నదే దేశ ఆకాంక్ష. రాజకీయాల్లో సామర్థ్యం, అనుభవం ఉన్న మహిళలు పుష్కలంగా ఉన్నారు. దేశ ప్రగతిలో మహిళలకూ భాగస్వామ్యం కల్పించాల్సిందే. ఉత్తరాది లేదు.. దక్షిణాది లేదు. జమ్మూ కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు అన్ని రాష్ట్రాలు సమానమే. డీలిమిటేషన్ ప్రక్రియలో ఏ



ఒక్క రాష్ట్రానికి అన్యాయం జరగదని హామీ ఇస్తున్న. ప్రస్తుతం ఉన్న 543 స్థానాలను 815కి పెంచడం ద్వారా పురుష అభ్యర్థుల సీట్లు తగ్గకుండానే.. 33 శాతం మహిళా రిజర్వేషన్లు (272 సీట్లు) అమలు చేయొచ్చు.

**- లోక్‌సభలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ**